సాక్షి
జగిత్యాల
శుక్రవారం । 15 । ఆగస్టు । 2025

పంద్రాగస్టుకు ఏర్పాట్లు పూర్తి

● పతాకావిష్కరణ చేయనున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



జగిత్యాల: పంద్రాగస్టు వేడుకలకు జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్‌గ్రౌండ్‌ను ముస్తాబు చేశారు బల్దియా సిబ్బంది. వీవీఐపీ, వీఐపీలు కూర్చునేందుకు టెంట్లు, కార్పెట్లు వేశారు. ఏర్పాటును కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ పరిశీలించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఉదయం 9.35గంటల కు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రశంసపత్రాల ప్రదానం ఉంటుంది.

న్యూస్‌రీల్

గోదావరి తీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



గోదావరి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

ధర్మపురి: గోదావరికి వరద పెరుగుతున్నందున తీరప్రాంత ప్రజలు, భక్తులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. గోదావరి ప్రవాహాన్ని గురువారం పరిశీలించారు. నదీ వద్ద ప్రస్తుతం నీటిమట్టం, ప్రవాహం, వేగం, సేఫ్టీ బారికేడ్లు, రక్షణ చర్యలను పరిశీలించారు. భక్తులు నదిలోపలికి వెళ్లి స్నానాలు చేయొద్దని, సెల్ఫీలు దిగడం ప్రమాదకరమని అన్నారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై ఉదయ్‌కుమార్, ఆలయ చైర్మన్ జక్కు రవీందర్, ఈవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులున్నారు.

పెరిగిన గోదావరి ప్రవాహం



ధర్మపురి వద్ద పెరిగిన గోదావరి

ధర్మపురి: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలు.. కడెం ప్రాజెక్టు నుంచి వదిలిన నీటితో ధర్మపురి వద్ద గోదావరి ఉధృతి పెరిగింది. మంగలిగడ్డ పుష్కరఘాట్ నుంచి నీరు ప్రవహిస్తోంది.

రాళ్లవాగు కుడికాలువకు నీరు విడుదల



నీరు విడుదల చేస్తున్న సిబ్బంది

కథలాపూర్: మండల సరిహద్దులోని రాళ్లవాగు ప్రాజెక్టు కుడికాలువకు నీటిపారుదలశాఖ అధికారులు గురువారం నీరు విడుదల చేశారు. ప్రాజెక్టు నీరు విడుదల చేసి పంటలు కాపాడాలని రైతులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఇటీవలే విన్నవించారు. ఈ మేరకు అధికారులు నీరు వదిలారు. ఈ కాలువ ద్వారా భూషణరావుపేట, ఊటుపెల్లి, కథలాపూర్, పెగ్గెర్ల గ్రామాల పరిధిలో సుమారు 2,500 ఎకరాలకు నీరందుతుందని అధికారులు పేర్కొన్నారు.

సీపీఐ వందేళ్ల చరిత్ర పల్లెకు చేరాలి



చెన్న విశ్వనాథంను అభినందిస్తున్న చాడ

కోరుట్లటౌన్: సీపీఐ వందేళ్ల చరిత్రను ప్రజలకు చేరవేయాలని ఆ పార్టీ జాతీయ నేత చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేని శంకర్ అన్నారు. కోరుట్లలోని సి.ప్రభాకర్‌భవన్‌లో జిల్లాస్థాయి కార్యకర్తల సమావేశాన్ని కార్యవర్గ సభ్యులు సుతారి రాములు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఎర్ర జెండాలతో ప్రదర్శనలు చేపట్టాలన్నారు. ఈనెల 20 నుంచి 22వరకు మేడ్చల్ జిల్లాకేంద్రంలో రాష్ట్ర మహా సభలు ఉంటాయన్నారు.

పార్టీ జిల్లా కార్యదర్శిగా చెన్న విశ్వనాథం

పార్టీ జిల్లా కార్యదర్శిగా కోరుట్లకు చెందిన చెన్న విశ్వనాథం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనను చాడ శాలువతో సన్మానించారు. అలాగే సహాయ కార్యదర్శిగా ఇరుగురాల భూమేశ్వర్, కార్యవర్గసభ్యులుగా వెన్న సురేష్, సుతారి రాములు, ఎండీ.ముక్రం, హనుమంతు, కొక్కుల శాంత, ఎన్నం రాధ, మహేష్, భూమయ్య, ఎండీ.ఉస్మాన్, అక్రమ్ మాలిక్, ప్రవీణ్, మౌలానా, రాజన్న ఎన్నికై నట్లు ప్రకటించారు.

జిల్లాకు మోస్తరు వర్ష సూచన

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాకు రానున్న ఐదు రోజులు మోస్తరు వర్ష సూచన ఉందని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త బి.శ్రీలక్ష్మి తెలిపారు. అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. పగటి ఉష్ణోగ్రతలు 28 నుంచి 30, రాత్రి ఉష్ణోగ్రతలు 24 డిగ్రీల సెల్సియస్‌గా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు.




మా భూమి.. మా దేశం.. మా ప్రాంతం.. మా సొత్తు.. మా మనుషులు నినాదంతో ఎందరో మహనీయుల పోరాటాలతో సాధించుకున్న స్వాతంత్ర్య భారతదేశం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. ఉద్యమ సమయం నాటి అనేక సంఘటనలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇంకా కళ్ల ముందు కదలాడుతున్నాయి. స్వాతంత్ర్య పోరాటానికి వేదికైన మెట్‌పల్లి ఖాదీప్రతిష్ఠాన్ విదేశీ వస్తు బహిష్కరణలో కీలక పాత్ర పోషించింది. తాజాగా పొలిటికల్ బ్రాండ్‌గా పేరొందుతోంది. ఉమ్మడి జిల్లానుంచి ఎందరో మహనీయులు ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారు. అమరులైన వారి పేరిట శిలాఫలకాలు ఆయా ప్రాంతాల్లో దర్శనమిస్తున్నాయి. నాటికీ.. నేటికీ పరిస్థితులు మారాయి. 78 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశం అభివృద్ధిలో దూసుకుపోతోంది. అయినప్పటికీ విద్య, వైద్యం, చట్టాలపై మరింత చైతన్యం రావాల్సిన అవసరం ఉందని నేటి యువత అంటోంది. 2047 నాటికి వందేళ్ల భారతదేశాన్ని పునర్నిర్మిస్తామని సగర్వంగా చెబుతోంది. నేడు 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా..

సగర్వంగా.. స్వాతంత్ర్యంగా

● స్వాతంత్ర్య ఉద్యమంలో ఉమ్మడి జిల్లా గుర్తులు ● పోరాటానికి వేదికైన ఖాదీ ప్రతిష్టాన్ ● దేశం కోసం పోరాడిన మహనీయులు
● 2047 నాటికి వందేళ్ల స్వాతంత్ర్య భారతంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన యువత ● నేటి పంద్రాగస్టు వేడుకలకు సర్వం సిద్ధం

(నేడు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గడిచిన 78ఏళ్లలో, ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు, పరిస్థితులపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో 100 మందిని పలుకరించగా.. వెల్లడించిన అభిప్రాయాలు ఇలా..)



ప్రస్తుతం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య? | స్వేచ్ఛా, సమానత్వం ఎక్కడైనా కనిపిస్తున్నాయా? | స్వాతంత్ర్య ఫలాలు అందరికీ దక్కాలంటే నిజాయితీగా పని చేయాల్సిన రంగం?

పొలిటికల్ బ్రాండ్.. మెట్‌పల్లి ఖాదీ ప్రతిష్టాన్



మెట్‌పల్లి ఖాదీ ప్రతిష్టాన్

కోరుట్ల/మెట్‌పల్లి: ఇక్కడి నేతలకు ఖాదీ బట్టలే స్ఫూర్తి. చాలా మందికి ఖాదీ రాజకీయంగా ఊపిరి పోసిందంటే అతిశయోక్తి కాదు. స్వాతంత్ర్య పోరాటకాలంలో ఖాదీ ఉద్యమానికి వేదికగా నిలిచింది జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి. గాంధీ శిష్యుడు అన్నాసాహెబ్ ఆధ్వర్యంలో మెట్‌పల్లిలో వెలిసిన ఖాదీ ప్రతిష్టాన్ ఖద్దరు ఆ కాలంలో ఖ్యాతి పొందింది. అప్పటి ఆనవాయితీని పుణికిపుచ్చుకుని మెట్‌పల్లి ప్రాంత రాజకీయ నాయకులు ఖాదీ వస్త్రాలు ధరించడం ఇప్పటికీ దూరం కాలేదు. కడక్ ఖాదీ బట్టలతో ఎవరైనా కనిపిస్తే చాలు ఈయన మెట్‌పల్లి లీడరని చెప్పొచ్చు. 1983లో ఎన్టీఆర్ ప్రభుత్వ హయంలో కార్మికశాఖ మంత్రిగా పనిచేసిన వర్దినేని వెంకటేశ్వర్‌రావు, మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్‌రావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ కేవీ.రాజేశ్వర్‌రావు, జనతా పార్టీ నుంచి ఏకైక ఎమ్మెల్యేగా ఎన్నికైన కొమొరెడ్డి రాములు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ ఖాదీ ప్రతిష్టాన్ వస్త్రాలు ధరించి రాజకీయాల్లో కీలకంగా ఎదిగిన వారే. 2009 అసెంబ్లీ పునర్విభజనలో కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గంగా మారినప్పటికీ.. మెట్‌పల్లి ఖాదీ కార్ఖానా స్ఫూర్తిగా రాజకీయాల్లోకి వచ్చిన నేతలు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, సంజయ్ ఇక్కడి ఎమ్మెల్యేలుగా కొనసాగడం గమనార్హం.

మొదటి జెండా ఎగిరింది ధర్మపురిలోనే..



కేవీ కేశవులు, మాణిక్యశాస్త్రి (ఫైల్)

ధర్మపురి: నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి, స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తింపు పొందిన జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన కేవీ.కేశవులు, మాణిక్యశాస్త్రి ప్రాణస్నేహితులు. కేశవులు ఆనాటి ముఖ్యమంత్రి జలగం వెంగల్‌రావు హయాంలో చేనేత జౌళిశాఖ మంత్రిగా కొనసాగారు. 1947లో ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజు ధర్మపురిలోని గోదావరి ఒడ్డునున్న కర్నెఅక్కెపెల్లి భవనంపై తన మిత్రుడైన మాణిక్యశాస్త్రితో కలిసి మొట్టమొదటి జాతీయ జెండాను ఆవిష్కరించారు. జెండా ఎగురవేయడం నిషేధమని అప్పటి నిజాం ప్రభుత్వం కేశవులను బంధించడానికి ప్రయత్నించగా.. నిండుగా ప్రవహిస్తున్న గోదావరిలోంచి వెళ్లి తప్పించుకున్నారు. ఏడాదిపాటు ముంబయిలో తలదాచుకున్నారు. 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినం రోజు తిరిగి ధర్మపురికి చేరుకున్నారు. 2019 జనవరి 30న అనారోగ్యంతో మృతి చెందారు.

పోరాటాల 'గాలిపల్లి'

ఇల్లంతకుంట: పోరాటాల గ్రామంగా చరిత్రలో నిలిచిపోయింది రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గాలిపల్లి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా.. నిజాంపాలిత ప్రాంతం హైదరాబాద్ రాష్ట్రానికి ఇంకా విముక్తి లభించలేదు. బద్ధం ఎల్లారెడ్డి ప్రాంతమైన గాలిపల్లి ప్రజలు నైజాం పాలనపై తిరగబడ్డారు. 1948 సెప్టెంబర్ మొదటి వారంలో రజాకార్లు గాలిపల్లికి వచ్చారు. తిరుగుబాటుదారులు వారిసైన్యంపై రాళ్లు విసిరారు. రజాకార్ల కాల్పుల్లో తిరుగుబాటుదారుల్లో ముందువరుసలో ఉన్న 11మంది చనిపోయారు. వీరిలో గాలిపల్లికి చెందిన వారు ఏడుగురు, బేగంపేట, సోమారంపేట, తాళ్లపల్లి, నర్సక్కపేట గ్రామాలకు చెందినవారు నలుగురు ఉన్నారు. రజాకార్ల పాలన నుంచి విముక్తి కలిగిన తరువాత గాలిపల్లిలో దాదాపు 20మందికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఫ్రీడంఫైటర్ పింఛన్లు మంజూరు చేశాయి.



స్వాతంత్ర్య పోరాటంలో వీరమరణం పొందిన 11 మంది శిలాఫలకం

పునరావాసం ఏర్పాట్లు చేసుకోండి

● కలెక్టర్ సత్యప్రసాద్



ఎర్దండి వద్ద గోదావరిని పరిశీలిస్తున్న కలెక్టర్

ఇబ్రహీంపట్నం: గోదావరి ఉధృతంగా ప్రవహించే అవకాశాలు ఉన్న నేపథ్యంలో పరీవాహక ప్రాంతాల ప్రజల కోసం ముందస్తు పునరావాస ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి వద్ద గోదావరి ప్రవాహాన్ని పరిశీలించారు. గోదావరి ఉధృతిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఇరిగేషన్ అధికారులు, పంచాయతీ కార్యదర్శి మనోజ్‌కు సూచించారు. గతేడాది వడగండ్ల వర్షాలతో నష్టపోయిన తమకు ఇప్పటివరకు పరిహారం ఇవ్వలేదని రైతు తెడ్డు రాజరెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పరిహారం డబ్బులు వచ్చాయని, త్వరలోనే జమ చేస్తామని కలెక్టర్ తెలిపారు. మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో ఎండీ.సలీమ్, ఇరిగేషన్ డీఈ దేవనందం, ఆర్ఐ రమేశ్ ఉన్నారు.

మద్దుల చెరువు పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

కోరుట్ల: పట్టణంలోని మద్దులచెరువును కలెక్టర్ బి.సత్యప్రసాద్ పరిశీలించారు. గురువారం 'వరద ముంపు ముప్పు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆయన చెరువు కట్టను పరిశీలించారు. మత్తడి వద్దకు వెళ్లి మున్సిపల్ కమిషనర్ రవీందర్, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. వరద మళ్లింపునకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ కృష్ణచైతన్య, ఇరిగేషన్ ఏఈ సిరాజ్ ఉన్నారు.

ఎన్నికల నిర్వహణలో ఈసీదే ప్రధాన పాత్ర



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాల: ఎన్నికల నిర్వహణలో ఎలక్షన్ కమిషన్‌దే ప్రధాన పాత్ర అని, రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్న ప్రధాని మోదీకి ప్రజలు గుణపాఠం చెబుతారని మాజీమంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు నాయకులు, కార్యకర్తలతో కలిసి గురువారం కొవ్వొత్తులతో ప్రదర్శన చేపట్టారు. తహసీల్ చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దొంగ ఓట్ల నమోదును బీజేపీ ప్రోత్సహిస్తోందని విమర్శించారు. ఉత్తరాది రాష్ట్రాల ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని, బీహార్‌లో 65 లక్షల ఓట్లను తొలగించారన్నారు. కాంగ్రెస్ అనుకూల ఓటర్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. ప్రజల విశ్వాసం కోల్పోతే ప్రజాస్వామ్యంపై నమ్మకం సన్నగిల్లుతుందన్నారు.

కోర్టుల్లో మీడియేషన్ డ్రైవ్

జగిత్యాలజోన్: జిల్లాలోని అన్ని కోర్టుల్లో కేసుల మధ్య రాజీ కుదిర్చేందుకు మీడియేషన్ డ్రైవ్ (మధ్యవర్తిత్వం) నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.రత్నపద్మావతి తెలిపారు. సెప్టెంబర్ 30వరకు కార్యక్రమం కొనసాగుతుందని, రాజీకి అనుకూలమైన క్రిమినల్, చెక్‌బౌన్స్, మోటార్ వాహనాలు, బ్యాంకు కేసులు, చిట్‌ఫండ్ కేసులను పరిష్కరిస్తామని వివరించారు.

అందరికీ విద్య .. సమాన అవకాశాలు

సాక్షి టాక్ షో

● అంతరాలు లేని సమాజం కావాలి.. ● అప్పుడే నంబర్‌వన్‌గా నిలుస్తాం
● జేఎన్‌టీయూ(నాచుపల్లి)లో 'సాక్షి' టాక్ షో ● అభిప్రాయాలు పంచుకున్న విద్యార్థులు



సాక్షి టాక్ షోలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

మల్యాల/కొడిమ్యాల: అంతరాలు లేని సమాజం కావాలి. కులమతాల బేధం లేకుండా అన్నివర్గాలకు నాణ్యమైన విద్య, వైద్యం అందాలి. సాంకేతికంగా స్వావలంబన సాధించేందుకు పరిశోధనలు పెరగాలి. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలి. స్వేచ్ఛ, సమానత్వ భావాలు విరజిల్లాలి. రాజ్యాంగంలోని హక్కులు, బాధ్యతలను ప్రతి పౌరుడు స్వేచ్ఛగా పొందాలి. దేశంలోని యువత శక్తిని సద్వినియోగం చేసుకుంటూ.. సుస్థిర అభివృద్ధికి బాటలు వేయాలి. కరోనావంటి మహమ్మారి మరోసారి వచ్చినా తట్టుకునే శక్తివంతమైన సమాజం నిర్మాణం కావాలి.. ఇవి భావిభారత పౌరుల మాటలు. '2047 నాటికి వందేళ్ల భారతదేశం' అంశంపై కొడిమ్యాల మండలం నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం 'సాక్షి' టాక్ షో నిర్వహించింది. ప్రిన్సిపాల్ విశ్వనాథన్ అధ్యక్షతన కొనసాగిన ఈ కార్యక్రమంలో దేశ అభివృద్ధిపై విద్యార్థులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

స్వాతంత్ర్య లక్ష్యం నెరవేరాలి



స్వాతంత్ర్య లక్ష్యం పూర్తిగా నెరవేరలేదు. మహిళలు అర్ధరాత్రి భయంలేకుండా నడిరోడ్డుపై సురక్షితంగా వెళ్లినప్పుడే అది సాధ్యం. 150 కోట్ల జనాభా ఉన్న మనదేశం ప్రపంచలోని చిన్న దేశాలతోనూ ఒలంపిక్స్‌లో పోటీపడలేకపోతోంది. ప్రతిఒక్కరూ క్రీడల్లో రాణించాలి. ఇస్రో ప్రపంచంలోనే ఉపగ్రహ ప్రయోగాల విజయాలతో ముందువరుసలో ఉంది.
– కౌశిక్, ఈఈఈ, సెకండియర్

నాణ్యమైన విద్య అందాలి



ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యనందించాలి. కుల, మతాలు మధ్య అంతరం లేని సమాజ నిర్మాణం కోసం చదువు ఒక్కటే మార్గం. ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలు నేర్చుకునేందుకు అనువైన వాతావరణం కల్పించాలి. పట్టణాల్లోని వసతులు నిరుపేదల ముంగిటకు రావాలి. చదువుతోపాటు ఉపాధి కల్పన దిశగా విద్య సంస్కరణలు చేపట్టాలి.
– ప్రతీక్, ఈసీఈ, థర్డ్‌ియర్

ఆరోగ్యంతోనే సమాజాభివృద్ధి సాధ్యం



ఆరోగ్యంతోనే సమాజాభివృద్ధి సాధ్యం. శారీరకంగా, మానసికంగా, ఎమోషనల్‌గా ధృడంగా ఉన్నప్పుడే సమస్యలు ఎదుర్కొనే శక్తి వస్తుంది. ప్రతికూల వాతావరణంలో నిబ్బరంగా నిలబడే ధైర్యం వస్తుంది. అనారోగ్యంతో ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తుంది. ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ.. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలి. – శరణ్య, సీఎస్ఈ, సెకండియర్

ప్రకృతిని కాపాడుకోవాలి



ప్రకృతిని కాపాడుకుంటూ అభివృద్ధి వైపు పయనించాలి. భవిష్యత్‌తరాల భవిష్యత్ మన చేతుల్లోనే ఉంది. నదులను కలుషితం చేయకుండా.. ప్రకృతిని కాపాడుకోవాలి. పచ్చని చెట్లను నరికేస్తూ చేపట్టే అభివృద్ధితో భవిష్యత్ అంధకారం అవుతుంది. ప్రకృతిని కాపాడుతూనే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి.
– శ్రుతి దయానంద్, ఈఈఈ, థర్డ్‌ియర్

అంతరాలు లేని సమాజం



ధనిక, నిరుపేద భేదం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందాలి. పారదర్శకతతో కూడిన పాలన, అవినీతి లేని సమాజం రావాలి. హైదరాబాద్‌వంటి ప్రాంతాల్లోని వసతులు మారుమూల పల్లెల్లోనూ అందుబాటులోకి తీసుకురావాలి. కుల, మతాల గోడలు బద్దలు కొట్టాలి. అందరూ సమానమనే సమాజం రావాలి.
– భానుశ్రీ, ఈఈఈ, థర్డ్‌ియర్

కాలుష్య రహిత సమాజం రావాలి



ఉదయం నిద్రలేవగానే కళ్ల ఎదుట పచ్చని చెట్లు దర్శనం ఇవ్వాలి. ప్రతి ఇల్లు పచ్చని చెట్లతో కళకళలాడాలి. నదుల్లోని నీరు కలుషితం కాకుండా తాగేందుకు అనువుగా ఉండాలి. దశాబ్దాల తరబడి అభివృద్ధి చెందుతున్న దేశంగా ఉన్న మనదేశం అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలి. కాలుష్యరహిత సమాజం కోసం మరో స్వాతంత్ర్య పోరాటం చేయాలి. – ప్రగతి, ఈఈఈ, థర్డ్‌ియర్

యువశక్తి పెరగాలి



దేశంలోని యువత తమ శక్తిని సద్వినియోగం చేసుకునేందుకు ప్రభుత్వాలు అవకాశాలు కల్పించాలి. ప్రపంచ దేశాల జీడీపీలో దేశం 16శాతం వాటా సమకూర్చుతోంది. అత్యధికంగా మానవ వనరులు ఉన్న మన దేశం ప్రపంచంలో అన్ని రంగాల్లో నంబర్ వన్ స్థానంలో నిలిచేందుకు యువతలోని శక్తిని వెలికితీసి, సుస్థిరాభివృద్ధికి బాటలు వేయాలి.
– వినిత్ సీఎస్ఈ, థర్డ్‌ియర్

మౌలిక వసతులు కల్పించాలి



విద్య, వైద్యం, పరిశ్రమలు, ఉపాధి రంగాల్లో మౌలిక వసతులు కల్పించాలి. ప్రతి గ్రామంలో రికార్డులు డిజిటలైజేషన్ కావాలి. రేపటి సమాజం కోసం విద్యార్థులే సమాజ దిక్సూచీగా మారేందుకు వసతులు కల్పించాలి. మౌలిక వసతులు కల్పిస్తేనే సుస్థిర అభివృద్ధి సాధ్యం.
– మనీషా సీఎస్ఈ, సెకండియర్

కుటుంబం అభివృద్ధి చెందితేనే..



పట్టుదల, క్రమశిక్షణ గల కుటుంబం అభివృద్ధితో సమాజాభివృద్ధి సాధ్యమవుతుంది. సృజనాత్మక ఆలోచనలు చేస్తూ.. సమాజాభివృద్ధికి పాటుపడాలి. మనదేశ అభివృద్ధికి నైపుణ్యాలను పూర్తిస్థాయిలో వినియోగించాలి. చదువుతోపాటు సమాజ హితం కోసం పనిచేయాలి. ప్రకృతిని కాపాడేందుకు ప్రజలను చైతన్యవంతం చేయాలి.
– మనిష్, సీఎస్ఈ, ఐటీ,

ప్లాస్టిక్ నిషేధించాలి



సుస్థిర అభివృద్ధి పేరిట భవిష్యత్ తరాలను నాశనం చేయవద్దు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను నిషేధించాలి. సేంద్రియ ఎరువులను అన్నదాతలకు ఉచితంగా అందించాల్సిన అవసరం ఉంది. రైతులను సేంద్రియ వ్యవసాయం వైపు ప్రోత్సహించాలి. చెట్లను నరికివేయకుండా ప్రకృతిని కాపాడుతూ అభివృద్ధి వైపు పయనించాలి.
– సౌమ్య, సీఎస్ఈ, సెకండియర్

క్లుప్తంగా

జిల్లాకు రూ.కోటి నిధులు

జగిత్యాల: రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని, ఎక్కడా ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరదల్లో ప్రాణనష్టం సంభవించకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముందస్తుగా జిల్లాకు రూ.కోటి మంజూరు చేస్తున్నామని తెలిపారు. పోలీసు యంత్రాంగం సహకారంతో సహాయక చర్యలపై అప్రమత్తం చేయాలన్నారు. జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డీపీవో మదన్‌మోహన్, ఆర్అండ్‌బీ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విషజ్వరంతో ఒకరి మృతి

సారంగాపూర్: మండల కేంద్రానికి చెందిన మోతుకు గంగమల్లు (55) విషజ్వరంతో బాధపడుతూ గురువారం మృతిచెందాడు. గంగమల్లు రెండురోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. బంధువులు జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న క్రమంలో గుండెపోటు రావడంతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గుండుసూదిపై జాతీయ జెండాతో పరుగెడుతున్న యువతి

- సూక్ష్మ కళాకారుడు గుర్రం దయాకర్ అద్భుత సృష్టి


గుండుసూదిపై జాతీయ జెండాతో యువతి


చిత్ర రూపకర్త గుర్రం దయాకర్

జగిత్యాలటౌన్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణానికి చెందిన సూక్ష్మ కళాకారుడు గుర్రం దయాకర్ గుండుసూది మొనపై జాతీయ జెండాతో పరుగెడుతున్న యువతి చిత్రాన్ని రూపొందించి ఔరా అనిపించాడు. పండుగలు, పబ్బాలు, జాతీయ పండుగలు వంటి ప్రత్యేక సందర్భంలో ఏదో సూక్ష్మరూప చిత్రం ద్వారా సమాజానికి సందేశం పంపించే దయాకర్.. ఈ స్వాతంత్య్ర వేడుకకు జాతీయ జెండాతో పరుగులు పెడుతున్న యువతి సూక్ష్మకళాకండాన్ని రూపొందించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ముందు వరుసలో నిలుస్తున్నారన్న సందేశాన్ని సమాజానికి అందించడమే ఈ చిత్ర ఉద్దేశమని దయాకర్ తెలిపారు. ఈ సూక్ష్మ కళారూపాన్ని తయారు చేసేందుకు మైనం పెన్సిల్ కలర్స్ ఉపయోగించానని, పది గంటల సమయం పట్టినట్టు తెలిపారు.

పనులకు ఆటంకం కలిగించొద్దు


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించొద్దని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రతిపక్షాలను కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో రూ.1.30 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ప్రారంభించారు. రాష్ట్రంలో ఏ మున్సిపాలిటికీ మంజూరు కాని నిధులు తెచ్చానని, పనులను అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు యత్నిస్తున్నాయని తెలిపారు. 40 ఇళ్లు కట్టని నాయకులు ఇతర నియోజకవర్గాల నుంచి వచ్చి 4,500 ఇళ్లలో వసతులపై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. మున్సిపల్ సిబ్బంది తడి, పొడి చెత్త వేరుగా చేయాలన్నారు. డంపింగ్‌యార్డు ప్రహరీకి రూ.2కోట్లు, చెత్తశుద్ధికి ఇప్పటికే రూ.5 కోట్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని వివరించారు.

లారీ, బైక్ ఢీకొని ఒకరి మృతి


అభిలాష్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న '108' సిబ్బంది

మంథని: మున్సిపల్ పరిధిలోని గంగాపురి వద్ద ద్విచక్ర వాహనా న్ని లారీ ఢీకొట్టిన ఘ టనలో పెద్దపల్లి మండలం కనగర్తికి చెంది న చెట్టం వెంకటేశ్ (30) మృతి చెందా డు. మంథని మండలం ధర్మారం గ్రామానికి చెందిన తిప్పని అభిలాష్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంకటేశ్, అభిలాష్ ఒక కార్యక్రమానికి హాజరై తిరిగి ద్విచక్రవాహనంపై పెద్దపల్లి వైపు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. గాయపడిన అభిలాష్‌ను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకున్నారు.

క్రెడిట్ కార్డుల కమీషన్ పేరుతో డబ్బులు స్వాహా..



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ శివ

వరంగల్ క్రైం: క్రెడిట్ కార్డుల ద్వారా కమీషన్ తీసుకోకుండా డబ్బులు ఇస్తానంటూ బాధితుల నుంచి లక్షలు స్వాహా చేసిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు హనుకొండ ఇన్‌స్పెక్టర్ ఎం.శివకుమార్ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జమ్మికుంట మండలం మడిపల్లికి చెందిన నేరెళ్ల అరుణ్ 2023లో హనుమకొండ రాయపురలో 'భద్రకాళి డిజిటల్ సేవ' పేరుతో షాపు ఏర్పాటు చేశాడు. ఆన్‌లైన్ అప్లికేషన్స్‌తోపాటు కస్టమర్ల క్రెడిట్ కార్డు స్వైప్ చేసి వారికి డబ్బులు ఇచ్చేవాడు. రెగ్యులర్ కస్టమర్లను తన వాలెట్‌లో యాడ్ చేసుకుని వారి క్రెడిట్ కార్డుల్లో బ్యాలెన్స్ ఉంటే ఫోన్ చేసేవాడు. తాను వేరే పేమెంట్ చేసేది ఉందని చెప్పి వారి కార్డులు స్వైప్ చేసి వారికి ఎలాంటి చార్జీలు లేకుండా తానే క్రెడిట్ కార్డుల బిల్లులు చెల్లిస్తానని మోసం చేసేవాడు. కార్డులు స్వైప్ చేసిన తర్వాత వేరే కస్టమర్ల కార్డులు పేమెంట్ చేసి దానికి 4 శాతం వరకు చార్జీ తీసుకుని లాభం పొందేవాడు. ఎలాంటి కమీషన్ లేకుండా డబ్బులు డ్రా చేసి ఇస్తానని నమ్మించి డబ్బులు వాడుకున్న అనంతరం కొన్ని రోజుల తర్వాత ఇతరుల క్రెడిట్ కార్డు బిల్లులు చెల్లించేవాడు. సంవత్సరన్నర పాటు కస్టమర్లకు నమ్మకంగా ఉంటూ వారి క్రెడిట్ కార్డు బిల్లులు చెల్లిస్తూ, క్రెడిట్ కార్డులు స్వైప్ చేస్తూ బాధితుల డబ్బుల నుంచి తన క్రాప్ లోన్, అప్పులు కట్టుకున్నాడు. ఇలా సుమారు రూ.28 లక్షలు వాడుకున్నాడు. కొద్ది రోజులుగా విజయవాడలో ఉంటున్న నిందితుడు బుధవారం షాపు ఖాళీ చేస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించగా అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

జగిత్యాలక్రైం: ప్రజలు శాంతియుత వాతావరణంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. శబ్దకాలుష్యం కలిగించే డీజేలు, భారీ సౌండ్ సిస్టమ్స్ నిషేధించామన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు వేడుకలను ప్రశాంతంగా పూర్తయ్యేలా అన్ని చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. రౌడీ షీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచుతున్నామని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మకూడదని పేర్కొన్నారు. సందేహాలుంటే పోలీసు వారికి లేదా 100 డయల్ ద్వారా సమాచారం అందించాలన్నారు.

సేవలకు దక్కిన గౌరవం

- ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఇద్దరు ఏఎస్సైలు


రాజేశుని శ్రీనివాస్


రుద్ర కృష్ణకుమార్

జగిత్యాలక్రైం/మల్యాల: విధి నిర్వహణలో వారు ఎప్పుడూ ముందున్నారు. తమ సర్వీసులో ఏనాడూ మచ్చ కూడా ఎరగరు. వారి సేవలను గుర్తించిన కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అనేక పతకాలు అందించింది. తాజాగా ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ పోలీస్ మెడల్‌కు కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. జగిత్యాల స్పెషల్ బ్రాంచ్ ఏఎస్సై రాజేశుని శ్రీనివాస్, మల్యాల పోలీస్‌స్టేషన్ ఏఎస్సై రుద్ర కృష్ణకుమార్‌కు మెడల్ ప్రకటించింది. రాజేశుని శ్రీనివాస్ 1989లో కానిస్టేబుల్‌గా పోలీసుశాఖలో చేరారు. 2012లో హెడ్ కానిస్టేబుల్‌గా, 2019లో ఏఎస్సైగా పదోన్నతి పొందారు. 2012లో రాష్ట్ర పోలీసు సేవా పథకం, 2019లో ఉత్తమ సేవా పథకం అందుకున్నారు. 36ఏళ్లుగా పోలీస్ పోలీసు శాఖకు చేస్తున్న సేవలను గుర్తించి కేంద్రప్రభుత్వం ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపిక చేసింది. అలాగే రుద్ర కృష్ణ కుమార్ 1989లో కానిస్టేబుల్‌గా పోలీసుశాఖలో చేరారు. 2017లో హెడ్‌కానిస్టేబుల్‌గా.. 2021లో ఏఎస్సైగా పదోన్నతి పొందారు. 2022లో రాష్ట్ర పోలీసు సేవా పథకానికి ఎంపికయ్యారు. 36 ఏళ్లుగా చేస్తున్న సేవలను గుర్తించి ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపిక చేశారు. ఇద్దరిని జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు. కష్టపడి పనిచేసే పోలీస్ అధికారులకు గుర్తింపు వస్తుందని తెలిపారు. గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

ఇద్దరు లీడింగ్ ఫైర్ ఆఫీసర్లకు రాష్ట్రపతి పతకాలు


వహిదుల్లాఖాన్


గోపాల్‌రెడ్డి

మెట్‌పల్లి: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి ఫైర్ స్టేషన్‌లో లీడింగ్ ఫైర్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వహిదుల్లాఖాన్ అత్యున్నత పురస్కారమైన రాష్ట్రపతి పతకానికి ఎంపికయ్యారు. 1986లో ఫైర్‌మెన్‌గా అగ్ని మాపక శాఖలో చేరిన ఆయన.. ఆసిఫాబాద్, ఇచ్చోడ, ఆదిలాబాద్, పెద్దపల్లి, కరీంనగర్‌లో పని చేసి.. రెండేళ్ల క్రితం మెట్‌పల్లికి బదిలీపై వచ్చారు. 2015లో లీడింగ్ ఫైర్‌మెన్‌గా పదోన్నతి పొందారు. మొదటి నుంచి అంకితభావంతో పనిచేసే ఆయన విపత్తుల సమయాల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తారనే పేరు సంపాదించారు. అత ని సేవలకు గుర్తింపుగా ఇప్పటివరకు ఆరు ప్రశంసపత్రాలు, ఒక సేవాపతకం ప్రదానం చేశారు. ప్రస్తుతం రాష్ట్రపతి పతకానికి ఎంపిక కావడంపై ఆయనను ఉన్నతాధికారులు అభినందించారు.

లీడింగ్ ఫైర్‌మెన్ గోపాల్ రెడ్డికి రాష్ట్రపతి అవార్డు

జమ్మికుంట: కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణ అగ్నిమాపక కేంద్రంలో లీడింగ్ ఫైర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న బీరెడ్డి గోపాల్‌రెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. ఫైర్‌మెన్‌గా విధుల్లో అత్యంత ఉత్తమ సేవలు అందించినందుకు రాష్ట్రపతి అవార్డుకు ఎంపికయ్యారు. ఫైర్ ఆఫీసర్‌గా విధుల్లో క్రమ శిక్షణ, నిబద్ధతతో పని చేసినందుకు రాష్ట్రపతి అవార్డుకు ఎంపిక చేసినట్లు గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈయనను పలువురు అభినందించారు.

రూ.1,947కే ఆరోగ్య పరీక్షలు

- 'మెడికవర్'లో వందేమాతరం హెల్త్ చెకప్ ప్యాకేజీ



మాట్లాడుతున్న గుర్రం కిరణ్

కరీంనగర్‌టౌన్: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నగరంలోని మెడికవర్ ఆస్పత్రి యాజమాన్యం ప్రత్యేక హెల్త్ చెకప్ ప్యాకేజీ ప్రవేశ పెట్టిందని ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ తెలిపారు. స్థానిక ఆస్పత్రిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వందేమాతరం హెల్త్ చెకప్ ప్యాకేజీ పేరిట అందుబాటులోకి తీసుకొచ్చిన పూర్తిస్థాయి ఆరోగ్య పరీక్షలను రూ.1,947 చెల్లించి పొందవచ్చన్నారు. కార్డియాలజీ, జనరల్ ఫిజీషియన్, డైటీషియన్ కన్సల్టేషన్‌తో పాటు కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (సీబీపీ), కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్(సీయూఈ), ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, లిపిడ్ ప్రొఫైల్, లివర్ ఫంక్షన్ టెస్ట్(ఎల్ఎఫ్‌టీ), ఎక్స్‌రే చెస్ట్ (విత్‌అవుట్ ఫిలిం), ఈసీజీ, 2డీ ఎకో, హెపటైటిస్‌బీఏ1సి, సీరం యూరియా, అల్ట్రాసౌండ్ స్కానింగ్ (అబ్డొమెన్- పెల్విస్), సీరం క్రియాటినిన్ పరీక్షలు ఈ ప్యాకేజీ ద్వారా నిర్వహిస్తామని వివరించారు. ఈ ప్యాకేజీ సెప్టెంబర్ 15వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా తీజ్ వేడుకలు


పాటిమీదితండాలో తీజ్ వేడుకల్లో గిరిజనులు

మెట్‌పల్లిరూరల్: బంజారాల సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే తీజ్ పండుగను గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. మెట్‌పల్లి మండలం పాటిమీదితండాలో గిరిజన మహిళలు, యువతులు మొలకెత్తిన గోధుమ బుట్టలను నెత్తిన పెట్టుకొని చెరువు వద్దకు వెళ్లి నిమజ్జనం చేశారు. సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి



జగిత్యాలటౌన్:స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి, జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు అన్నారు. హర్‌ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని టౌన్ హాల్ నుండి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణరావు, కన్నం అంజయ్య, కృష్ణహరి, మ్యాదరి అశోక్, పాత రమేష్, తిరుపతి, గద్దల లక్ష్మి, చెన్నాడి మధురిమ, పద్మ తదితరులు ఉన్నారు.

16న పెద్దగుట్ట నృసింహునికి వరదపాశం

సారంగాపూర్: బీర్‌పూర్ శ్రీలక్ష్మీ నృసింహస్వామి అనుబంధం శ్రీపెద్దగుట్ట నృసింహస్వామికి ఈనెల 16న వరదపాశం సమర్పించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు వొద్దిపర్తి పెద్దసంతోష్, అర్చకులు చిన్న సంతోష్, మధుకుమార్ తెలిపారు. ఉదయం ఆలయం సమీపం నుంచి ఉదయం 7 గంటలకు కాలినడకన పెద్ద గుట్టపైకి చేరుకుని వరదపాశాన్ని కిందకు జారవిడుస్తారు.